## కోరమీసాల మల్లన్న 76 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు

### రూ.73,18,504 నగదు, 80 గ్రాముల బంగారం, 4 కిలోల వెండి

**కొమురవెల్లి, నవంబరు 11, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి హుండీల ఆదాయం మంగళవారం దేవాలయం ఆవరణలో శివరామకృష్ణ భజన మండలి సేవ సమితి సేవ సభ్యులచే లెక్కించారు. 76 రోజులకు గానూ స్వామి వారికి సమర్పించిక కానుకల్లో రూ. 73,18,504 నగదు ఆదాయం రాగా 80 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలలో మిశ్రమ వెండితో పాటు 21 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ ఈవో టి.వెంకటేష్ తెలిపారు.

కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మీ, దేవాదాయశాఖ డివిజన్ సహాయ కార్యనిర్వహణాధికారి బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, మామిడాల లక్ష్మీ, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, స్వర్ణకారుడు నర్సింహాచారి, ఎస్‌బిఐ బ్యాంకు సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కంగ్టిలో సోషల్ ఆడిట్...

**కంగ్టి, నవంబర్ 11 ప్రభాతవార్త**
మండల కేంద్రమైన కంగ్టిలో అధికారుల ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో సోమ, మంగళవారాలు రెండు రోజులపాటు 15వ సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. తనిఖీలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్ పూర్తయింది. నాలుగు రకాల డివిషన్స్ వచ్చాయి. ప్రాసెస్ వైలేషన్‌లో సెవెన్ రిజిస్టర్స్ అప్డేట్ చేయకపోవడం, రోజ్గార్ దివాస్ జరపకపోవడం ఇలాంటివి అదేవిధంగా గీవెన్స్ లో బాగంగా జాబ్ కార్డు అప్డేట్ చేయడం కొత్త జాబ్ కార్డు ఇవ్వడం ఇలాంటివి, అదేవిధంగా ఫైనాన్షియల్ డివియేషన్ పనిచేసిన దానికి సరి అయిన పేమెంట్ రాకపోవడం ఎక్కువ పేమెంట్ చేయడం ఇలాంటివితో పాటు ఫైనాన్షియల్ మిస్ అప్రప్రియేషన్ ఆర్థిక సంబంధమైనవి ఇవి పెద్దగా లేవు. పై నాలుగింటికి సంబంధించి ఫైన్‌ల రూపంలో మండలం మొత్తం మీద 57000 వేల రూపాయలు సంబంధిత అసిస్టెంట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లు మరియు పంచాయతీ కార్యదర్శిలు అలాగే ఈసిఏపిఓ లకు రికవరీ రూపంలో చెల్లించమని ఎంపీడీఓ సత్తయ్య ఆదేశించారు.


విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

## ఒకే కూరతో విద్యార్థులు భోజనం ఎలా తింటారు ?

### -ప్రిన్సిపాల్‌పై జిల్లా కలెక్టర్ హైమావతి ఆగ్రహం

**ములుగు, నవంబరు 11 (ప్రభాతవార్త):** విద్యార్థులు ఒకే కూరతో భోజనం ఎలా తింటారని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి వంటి మామిడి ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ములుగు మండల పరిధిలోని వంటిమామిడి ప్రాథమిక పాఠశాలను, క్షీరసాగర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని తరగతి గదులను, పరిసరాలను, వంటగదిని పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులపై శ్రద్ధ పెట్టి బాగా చదవాలని, ఏది అర్థం కాకున్నా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. వంటగదిని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వంటిమామిడిలోని ప్రాథమిక పాఠశాలలో మెనూ ప్రకారం వంటలు వండకుండా ఒకే కూర వండడంతో ప్రధానోపాధ్యాయునిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మానసికానందానికి క్రీడలు దోహదం

### సిద్దిపేట సిపి విజయ్‌కుమార్


క్రీడా పోటీల ప్రారంభానికి జ్యోతి ప్రజ్వలనచేస్తున్న సిపి విజయ్‌కుమార్

**కొండపాక, నవంబర్ 11, ప్రభాతవార్త :** క్రీడాకారులు ఆటల్లో ప్రతిభను కనబరిచి గెలుపు ఓటమిలతో సంబందంలేకుండా మంచి అనుభవాన్ని, అనుభూతిని తమ వెంట తీసుకెళ్లాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్ఎం విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం కొండపాక శివారులోని మహాత్మజ్యోతిభా పూలే పాఠశాలలో మెదక్ జిల్లా స్థాయి అటల పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి అయన మాట్లాడారు. క్రీడలు శరీరదారుడ్యంతోపాటు మానసిక ఆనందాన్నిస్తాయన్నారు. ఎప్పుడు ఎవరిని మోసం చేయకుండా జీవితంలో పైకి ఎదగాలన్నారు. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి పక్షపాతం లేకుండా క్రీడపోటీలను నిర్వహించాలని వ్యాయమ ఉపాధ్యాయులకు సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి నుండి వచ్చిన అనుభవంతో గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో క్రీడల ఒఎస్‌డి శ్రీనివాస్‌గౌడ్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ గోపాల్‌రెడ్డి, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, సిద్దపేట ఎంజెపి బాలుర గురుకుల ప్రిన్సిపల్ శ్రీలత, గొల్లపల్లి గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** మెదక్ మండలం పాతూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్ మంగళవారం ఆకస్మికం గా సందర్శించారు. కేంద్రం లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్‌లను పరిశీలించి, ఎప్పటికప్పుడు వచ్చే ధాన్యం వివరాలను అలాగే కొనుగోలు అయిన వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. తేమ వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లు లకు తరలించాలన్నారు. సరిపడా టార్పాలిన్ లను అందుబాటులో పెట్టుకోవాలని.. వాతావరణ ప్రతికూల ప్రభావం వలన .వర్షం వచ్చే సూచనలు తెలిసినప్పుడు కేంద్రం లో ఉన్న ధాన్యం తడవకుండా వెంటనే తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు జిల్లాలో ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని ఇప్పటివరకు 70 వేల 100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని వివరించారు. ఈ పరిశీలన లో అదనపు కలెక్టర్ వెంట కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు

### రాజీయే రాజమార్గం : జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

**మెదక్ టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** నవంబర్ 15వ తేదీన జరగనున్న ప్రత్యేక లోక్అదాలత్‌ను కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని రాజీయే రాజమార్గం అని జిల్లా మంగళవారం ఎస్పీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా త్వరగా, తక్కువ ఖర్చుతో, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు అని వివరించారు. జిల్లా ఎస్పీ ప్రజలకు సూచిస్తూ చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని, రాజీ అంటే విజయం వైపు దారితీసే నిజమైన మార్గమని పేర్కొన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ లు, ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తమ కేసులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవాలనుకునే వారు సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# పత్తి, ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య


పుల్‌కల్‌లో వడ్ల మాయశ్చర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**పుల్‌కల్, నవంబరు 11 (ప్రభాతవార్త):** ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య పుల్కల్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం వివరాలు, తూకం వేసి మిల్లులకు పంపిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం సరైన తేమ శాతం ఉన్న ధాన్యం తూకం వేసి వెంటనే మిల్లులకు పంపించాలని సిబ్బందికి సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని హార్వెస్టర్ యజమానులతో సమావేశం నిర్వహించి ఆర్పిఎం ఎక్కువగా ఉంచి హార్వెస్టర్లు నడిపేలా అవగాహన కల్పించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆర్పిఎం ఎక్కువగా ఉంచితే ధాన్యంలో తాలు రాదని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై హార్వెస్టర్ యజమానులకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ శివారులోని కోదండరామా ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు రైతులకు నూతన పత్తి కొనుగోలు విధానంపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ, అధికారులకు మార్కెటింగ్ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు కిసాన్ కంపాస్ యాప్ స్లాట్ బుక్ చేసుకొని అందులో సూచించిన విధంగా నిర్ణీత సమయానికి సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకురావాలని సూచించారు.

**పదవ తరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలి**

పుల్కల్ మండల పర్యటనలో భాగంగా సింగూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను (బాలుర) ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలంటే ఉండే భయాన్ని తొలగించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని స్టోర్ రూమ్, డైనింగ్ హాలు, కిచెన్‌షెడ్‌ను పరిశీలించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బియ్యం సంచుల కింద బియ్యం తడవకుండా చెక్కలు వేసి వాటిపై బియ్యం సంచులు నిల్వఉంచాలని సిబ్బందికి సూచిం చారు. పాఠశాలలోని విద్యార్థుల కోసం వచ్చిన స్కూలు యూనిఫామ్ క్లాత్ ను వెంటనే పంపి యూనిఫామ్స్ కుట్టించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో తాగునీటి వసతివివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం స్థాయినిబట్టి వెంటనే బిల్లులు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికి మంజూరైన ఇండ్లు ఇప్పటివరకు నిర్మాణంలో ఏ దశల్లో ఉన్నాయో అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఆర్ డి ఓ పాండు, సంబంధిత శాఖల అధికారులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ధాన్యాన్ని తూకం వేస్తున్న కేంద్రం నిర్వాహకులు రైతులు తదితరులు

'వార్త'కు స్పందన

## ధాన్యం కొనుగోలు ప్రారంభం

**నర్సాపూర్, నవంబరు 11, ప్రభాతవార్త:** మండలపరిధిలోని ఆవంచ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అధికారులు స్పందించి ఎట్టకేలకు కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించారు. ఆవంచ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు కరువు, కేంద్రంలో రైతులు ఆరబెట్టి పడిగాపులు కాస్తూ నెలరోజులు గడుస్తున్నా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదని తూకం వేయడం లేదన్న వార్తా కథనాలు వార్త దినపత్రికలో వచ్చిన నేపథ్యంలో శీర్షికకు స్పందించిన సంబంధిత అధికారులు ఎట్టకేలకు మంగళవారం ఆవంచ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలును ప్రారంభించారు. 'వార్త' కథనానికి స్పందించిన నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి పిఎసిఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు స్పందించి మ్యాచర్ మిషన్, తూకం కాంటాను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి రైతులనుండి ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెలరోజులుగా కేంద్రం వద్ద పడిగాపులు కాసిన రైతులు తమ ధాన్యాన్ని తూకం వేయడం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా మండలంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను ప్రారంభించడం జరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు లేవని కథనాలు తెచ్చిన వార్త దినపత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ కొనుగోలు కేంద్రం లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించడానికి సహకరించిన జిల్లా రైతు రక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్ కు పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# యధేచ్చగా ప్రభుత్వ భూమి కబ్జా

### అడ్డుకున్న గ్రామస్థులు, జెసిబి సీజ్

**మునిపల్లి, నవంబరు 11 (ప్రభాతవార్త):** మునిపల్లి మండలం మల్లారెడ్డిపేట సమీపంలో ని మల్లికార్జునపల్లి, బుసారెడ్డి పల్లి శివారులలో ఏదేచ్ఛగా ప్రభుత్వ భూమితోపాటు సింగూర్ ముంపు భూమినిసైతం భూ భకాసురులు కబ్జా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవిన్యూ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అక్కడ ఒరియల్టర్ 60 ఎకరాలలో ఫార్మ్‌హౌస్ ఏర్పాటు చేశాడు. అంతేగాకుండా తన పొలంకు ఆనుకున్న వున్నా ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు. వాటర్ షెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన కుంట, చెక్ డాంలను సైతం ఆక్రమించాడు. మల్లికార్జునపల్లి వెళ్లే దారిలో మొరం త్రవ్వి తన ఫార్మ్ హౌస్‌కు రోడ్డు వేసుకున్నాడు. మల్లికార్జునపల్లికి బాట లేకుండా చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఆజాగావైపు కన్నెత్తి చూడలేదు. భూమిని కబ్జా చేయడంతో గ్రామంలోని పశువులకు గ్రాసం లేకుండా పోయిందన్నారు. కుంటలో మూగ జీవాలు నీళ్లు తాగకుండా చేశారాని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జేసీబీ సహాయంతో ప్రభుత్వభూమిలో తవ్వకాలు జరుపుతుండటం చుసిన గ్రామస్తులు అక్కడికి వెళ్లి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ శుభాష్ అక్కడికి జేసీబీ సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించాడానికి ప్రయత్నస్తుండగా ఆ భూమి కి సంబందించిన శ్రీనివాస్ అనే వ్యక్తి తాను పీసీసీ నాయకుడి పిఏ నని ఆర్ఐ ని బెదిరించి జేసీబీ కీ ని దౌర్జన్యంగా లాక్కుని వెళ్ళిపోవడం గమనార్హం. పోలీసులు వచ్చినప్పటికి డోంట్ కేర్ అంటూ జేసీబీ తీసుకొని పోయాడు. దౌర్జన్యానికి పాల్పడుతున్న భూ కబ్జాదారుడిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమి ని కాపాడాలని లేని యెడల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.


ప్రభుత్వ భూమిలో జెసిబితో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం


కోమటిచెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తు కమిషనర్ అశ్రిత్‌కుమార్

## బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవు

### మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్

**సిద్దిపేట అర్బన్, నవంబరు 11, ప్రభాతవార్త :** బహిరంగ ప్రాంతాల్లో చెత్తవేస్తే చర్యలు తప్పవని పట్టణ మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కమిషనర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కోమటి చెరువును సందర్శించి నిత్యం ఎంతో మంది కోమటిచెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను సందర్శించడానికి వస్తుంటారని నిర్వహణ సరిగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పగుళ్లు వచ్చిన బండలను తొలగించి నూతన బండలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కోమటిచెరువు పై మహిళా శక్తి క్యాంటిన్ స్థల పరిశీలన చేశారు. హౌసింగ్ బోర్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పరిశీలించి సమస్య ఉన్నందున వెంటనే సమస్యను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. అనంతరం పురపాలక సంఘం కార్యాలయం వనమహోత్సవం సిబ్బంది హాజరును పరిశీలించారు. హౌసింగ్ బోర్డులో ఉన్న డిఆర్‌సిసి కేంద్రం నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట డిఎంసి హనుమంతు, ఎఈఈ పృథ్వీ తదితరులు ఉన్నారు.

## సిద్దిపేటను అందెశ్రీ జిల్లాగా పేరు మార్చాలి

**సిద్దిపేట అర్బన్, నవంబరు 11, ప్రభాతవార్త :** సిద్దిపేటకు విశ్వకవి స్వర్గీయ అందెశ్రీ సిద్దిపేటజిల్లాగా పేరు మార్చాలని సిఎం రేవంత్‌రెడ్డికి బీసీవై పార్టీ రాష్ట్ర నాయకులు గాదగోని చక్రధర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, అందెశ్రీని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ కీలక పాత్ర పోషిం చడానికి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర గీతం రచించిన అందెశ్రీకి సముచిత గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

### సంగారెడ్డిలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 11, ప్రభాతవార్త :** భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని మంగళవారం సంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ మాధురి హాజరై, మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ, భారత తొలి విద్యాశాఖమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, మహా విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మాత్రమే కాకుండా విద్యారంగ అభివృద్ధికి విశేషసేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి ఫలితంగానే భారతదేశంలో విద్యా విస్తరణకు పునాదులు వేశారని, దేశ యువత ఆయన ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి విశాలాక్షి , డి.ఆర్.ఓ పద్మజ రాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్,లు కలెక్టరేట్ సిబ్బంది, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### అందెశ్రీ మృతి బాధాకరం : దేశబోయిని నర్సింహులు

**గజ్వేల్ టౌన్, నవంబరు 11 (ప్రభాతవార్త):** రచయిత, సాహితి శిఖరం అందెశ్రీ మృతి బాధాకరమని సంఘ సేవకులు, జాతీయ యువ జన అవార్డుగ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అందెశ్రీ మృతి సాహితీ లోకానికి కాదు తెలంగాణకు తీరని లోటు అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన అక్షరాన్ని ఇంధనంగా మార్చి ప్రజల్లో నిత్యం చైతన్యాన్ని జోలింప జేసిన యోధుడు అందెశ్రీ అని అన్నారు. నిత్యం పేదల పక్షాన గొంతు వినిపించే నిస్వార్థ తెలంగాణ మట్టి మనిషి అని కొనియాడారు. అందెశ్రీ భౌతికంగా మన మధ్య లేకపోయినా వారు రచించిన జయ జయహే తెలంగాణ గీతం నిత్యం ప్రజల గుండెల్లో నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

# నిబంధనలు పాటించి వ్యాపారాలు చేసుకోవాలి

### సిద్దిపేట ట్రాఫిక్ ఎసిపి సుమన్‌కుమార్


ట్రాఫిక్ పోలీసులకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ ఏసిపి సుమన్‌కుమార్

**గజ్వేల్ టౌన్, నవంబరు 11 (ప్రభాతవార్త):**
ఫుట్‌పాత్‌లను, రోడ్లను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు కొనసాగిస్తే చర్యలు తప్పవని సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్‌కుమార్, గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని ప్రధాన రోడ్లలో వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు, దుకాణదారులు ట్రాఫిక్, రోడ్డు, మున్సిపల్, మార్కెట్ నిబంధనలను పాటించి వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఫుట్‌పాత్, రోడ్డు మీదికి సామాన్లు, ప్లెక్సీ బోర్డులు పెట్టి వాహనదారులకు, నడుచుకుంటూ వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారస్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదుచేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. వాహనంపై బయటకు వెళ్లేటప్పుడు కుటుంబసభ్యులను దృష్టిలో పెట్టుకొని వెళ్లాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే జరగరాని ప్రమాదం జరిగి కుటుంబానికి అన్యాయం చేయవద్దన్నారు. ఇంటి యజవాని లేని ఇల్లు చిన్నాభిన్నం అవుతుందని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపి ప్రమాదానికి గురైతే ఎలాంటి ఇన్సూరెన్స్ వర్తించదని సూచించారు. అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావడం కన్నా అదుపులో ఉండే వేగంతో క్షేమంగా గమ్యానికి చేరుకోవడం మంచిదన్నారు. మైనర్ డ్రైవింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సైలెన్సర్ మార్పింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

**క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి**

గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో ఇంట్రాక్టివ్ సెషన్ నిర్వహించి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. విధులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించవద్దని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసేటప్పుడు రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది కూడా ఆన్ డ్యూటీ అండ్ ఆఫ్ డ్యూటీలో కూడా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరి కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నిరేష్, ట్రాఫిక్ ఏఎస్ఐలు జగదీశ్వర్, కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.


మృతి చెందిన ఎద్దు

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**నాగల్‌గిద్ద, నవంబరు 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని షాపూర్ గ్రామ శివారులో మంగళవారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన మేస్త్రి బసప్ప పొలంలో ఎద్దు మేపుతుండగా సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి షాక్‌కుగురై మృతి చెందిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని అతను కోరాడు.

## ఎనిమిది మందికి రూ.80వేల జరిమానా

### -ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష

**గజ్వేల్ టౌన్, నవంబరు 11(ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి రూ.80వేల జరిమానా విధించడంతో పాటు ఒక్కరికి మూడు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. గతకొన్ని రోజులుగా గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాలతో వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 9 మందిని మంగళవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి ఎనిమిది మందికి రూ.80వేల జరిమానా, ఒక్కరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

## నిషేధిత నల్లబెల్లం, స్పటిక పట్టివేత

**ఆమనగల్లు, నవంబరు 11, ప్రభాతవార్త:** ఆమనగల్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు చేపట్టిన తనిఖీలలో పెద్దఎత్తున నిషేధిత నల్లబెల్లం, స్పటిక పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో కడ్తాల్ టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో 120 కేజీల నల్లబెల్లం, 120 కేజీల పట్టిక నిషేధిత పదార్థాలు దొరికాయి. దీనికి సంబంధించిన వివరాలను ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ విలేకరులకు వెల్లడించారు. హైదరాబాద్ నగరం నుండి సారా తయారికి వినియోగించే నల్లబెల్లం, పట్టిక పదార్థాలను ప్రత్యేక వాహనంలో ఆమనగల్లు వైపు తరలిస్తున్నట్లు సమాచారం రాగా, అప్రమత్తతతో మెలిగి కడ్తాల్ టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. టిజి 07 యు 2571 వాహనంపై అనుమానంతో తనిఖీలు చేశామని చెప్పారు. వాహనం ట్రాలీలో 30 కేజీల చొప్పున 4 బ్యాగులతో 120 కేజిల నల్లబెల్లం కనిపించిందని వివరించారు.



పట్టుబడిన నిందితులను హాజరుపరిచిన ఎక్సైజ్‌శాఖ పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం

### కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశం

**వికారాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త :** జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందిగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో అ నుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరిగితే సహించబోమన్నారు.

## శామీర్‌పేట సొసైటీ సేవలు భేష్

**శామీర్‌పేట, నవంబరు 11, ప్రభాతవార్త :** శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘాన్ని ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సహకార సంఘాల సిఇఓలు,సెక్రటరీలు సందర్శించారు. మంగళవారం శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘాన్ని నాబార్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు వారి ఆధ్వర్యంలో ఆయా రాష్ట్రాల సహకార సంఘాల సిఇఓలు, సెక్రటరీలు శిక్షణా కార్యక్రమంలో భాగంగ రెండవ రోజు వారు సందర్శించి సంఘం పనితీరును తెలుసుకున్నారు. శామీర్‌పేట సొసైటీ చైర్మన్ డా.ఆర్.మధుకర్‌రెడ్డి ఈ సహకార సంఘం నుంచి రైతులకు,సభ్యులకు అందుతున్న సేవలను ప్రయోజనాలను వారికి వివరించారు. రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఫార్మ్‌రైస్ వన్ ప్రాజెక్టు ద్వారా మార్కెట్ లింకేజీ సౌకర్యం,డ్రోన్లు, స్ప్రేయర్లు అతి తక్కువ ధరలో టార్పాలిన్ల అమ్మకాలు సిఎస్‌సి సెంటర్ ద్వారా రైతులకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను చైర్మన్ వివరించారు. ఆ తరువాత నాబార్డు పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ తమ రాష్ట్రంలో తమ సంఘం చేస్తున్న అభివృద్ధిని, వ్యాపారాల గురించి వివరించారు. శామీర్‌పేట సంఘం ద్వారా అందుతున్న సేవలు, అభివృద్ధిని చూసి వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సంఘాన్ని ఆదర్శంగ తీసుకుని తమ సంఘాల్లో ప్రవేశపెడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు నాబార్డు అధికారులు షీలా, సతీష్, యోగేశ్, స్థానిక సంఘం వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, డైరక్టర్లు ముద్దం ప్రతాప్‌రెడ్డి, లక్ష్మిగారి నర్సింలుగౌడ్, ఆకుల చంద్రకళ, సంఘం సిఇఓ రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేటకు వెళ్లి వస్తుండగా కరెంటు కాటు

### ఒకరు మృతి

**మోమిన్‌పేట్, నవంబరు 11, ప్రభాతవార్త :** మొక్కజొన్న పంటను అడవి జంతువుల నుండి కాపా డుకోవడానికి పొలం చుట్టూ విద్యుత్ తీగలు వేయగా ప్రమాదవశాత్తు పంటపొలం వద్ద విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మోమన్ పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది.

## గ్రామాల్లో చలి మంటలు

### పడిపోతున్న ఉష్ణోగ్రత - మూగజీవాలు సైతం గజగజ



**మోమిన్‌పేట్, నవంబరు 11, ప్రభాతవార్త :** మండలంలో ఇటీవల వరకూ వరుణుడి ఉరుములు, అకస్మాత్తుగా కుండపోతతో దడ పుట్టించి చూపించిన వాతావరణం ఇప్పుడు చలిగాలుల ఎంట్రీతో చుక్కలు చూపిస్తోంది. ఆదివారం రాత్రి నుంచే మోమిన్ పేట ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. వాతావరణంలో ఉష్ణోగ్రత మరింత తగ్గే అవకాశాలున్నాయని వాతావరణ విభాగం హెచ్చరిస్తోంది. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. రోజురోజుకు చలి పంజా విసురుతోంది. చలి పెరగడంతో ఎక్కడికక్కడ చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. మూగజీవాలు సైతం చలిమంటలు వద్ద సేద తీరుతున్నాయి. ఉన్ని దుస్తులు వేసు కుంటే గాని బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. ద్రోణి కారణంగా పలు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందనే హెచ్చరికలు జారీ అవుతున్నాయి. దీంతో ప్రస్తుత సీజన్లో ప్రజలు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గ్రామాల్లో చీకటి పడితే చాలు చలిగాలుల తీవ్రత ఎక్కువుతున్నాయి.



బాలవికాసలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

## రాంపల్లిదాయరలో సామాజిక వ్యాపార సమ్మిట్

### మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రారంభం

### భారతీయులతోపాటు 40 మంది విదేశీయులూ భాగస్వామ్యం

**కీసర, నవంబరు11, ప్రభాతవార్త :** బాల వికాస సెంటర్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిల్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక వ్యాపార సమ్మిట్ ఇంపల్స్ 2025 కార్యక్రమం నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లిదాయరలోని బాలవికాస సెంటర్ ఫర్ సోషల్ అండ్ రెస్పాన్సిబిల్ బిజినెస్ (సిఎస్ ఆర్‌బి) ప్రాంగణంలో పర్యావరణ,అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. బాలవికాస వ్యవస్థాపకులు బాలతెరిసా, ఆంద్రే జింగ్రెస్ దంపతులు కెనెడా నుండి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ వ్యాపారంలో ప్రైవేటు సంస్థలు కేవలం లాభాపేక్ష కోసం మాత్రమే వ్యాపారాలు చేస్తున్నాయని వారి ఆలోచనలో మార్పు కోసం సామాజిక కోణంలో వ్యాపారాన్ని ఎలా చేయాలో నేర్పించడానికి 2013లో సిఎస్ ఆర్‌బిని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సమాజంలో సమస్యలను తీర్చే విధంగా ఇంపల్స్ 2025 తీసుకెళ్లడం ఆనందంగా ఉందన్నారు. కేవలం భారతీయులతోనే కాకుండా 40 మంది విదేశీయులతో ఈ సదస్సు ఏర్పాటు చేయడం ద్వారా ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకునే విధంగా ఒకరి నాగరికత మరొకరు తెలుసుకునే విదంగా ఉంటుందన్నారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ బాలవికాస బృందాన్ని అభినిందిమచారు.

# అశ్రు నివాళి



- అందెశ్రీకి ఘట్‌కేసర్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- కుటుంబసభ్యులకు సిఎం ఓదార్పు
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని భరోసా
- కడసారి వీడ్కోలుకు భారీగా తరలి వచ్చిన రాజకీయ, ప్రజా పక్షాల నేతలు





అంతిమయాత్రలో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



అందెశ్రీ భౌతిక కాయం వద్ద రోధిస్తున్న భార్య, కుమార్తెలు



అందెశ్రీకి గేయాలాపనతో వీడ్కోలు పలుకుతున్న విమలక్క



కడసారి ప్రయాణంలో డప్పు కళాకారుల వీడ్కోలు దృశ్యం

**ఘట్‌కేసర్, నవంబరు 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో మంగళవారం కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు అందెశ్రీ అంత్యక్రియల్లో పాల్గొని శ్రద్దాంజలి ఘటించారు. లాలగూడలోని ఆయన నివాసం నుంచి కుటుంబసభ్యులు అంతిమయాత్ర వాహనంలో ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి ఉదయం 10 గంటలకు తీసుకువచ్చారు. అందెశ్రీ బంధువులు, అభిమానులు, నాయకులు, స్థానికులు పెద్దసంఖ్యలో వచ్చి ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి పుష్పగుచ్చాలతో శ్రద్దాంజలి ఘటించారు. ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తి కాకుండానే అందెశ్రీ మృతి చెందడంపై భార్య, పిల్లలు బోరున విలపించారు. ఎన్‌ఎఫ్‌సీనగర్‌కు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్‌సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్, మాజీ రాజ్యసభసభ్యులు వి.హనుమంతరావు, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్‌లు వచ్చి అందెశ్రీ పార్థీవదేహానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ భార్య మల్లుబాయి, కూతుళ్ల వెన్నెల, వక్కులమ్మ, వేకువ, కుమారుడు దత్తసాయి, బంధువులు, ఆప్తులు పార్థీవదేహం వాహనంలో ఉన్నారు. కుటుంబసభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంతిమయాత్ర ఉదయం 12 గంటలకు ఇంటి నుంచి ప్రారంభం కాగా ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో అభిమానులు, కళాకారుల బృందాలు పాటలు పాడుతూ డప్పుశబ్దాలతో అందెశ్రీ అమర్‌హై అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. మంత్రులు అడ్లూరి, జూపల్లి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలు స్మృతివనం వరకు నడిచారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు సీఎం, విఐపిల రాకతో ఎప్పటికప్పుడు పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. అంతిమయాత్ర శివారెడ్డిగూడ దాటగానే రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు కూడా రాగా డానో కంపెనీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి వాహనం ముందు నడిచారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దగ్గరలో ఏర్పాటు చేసిన అందెశ్రీ స్మృతివనంలో కుటుంబ ఆచారం ప్రకారం ఆయన కుమారుడు దత్తసాయి మధ్యాహ్నం 1:30 గంటలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈసందర్భంగా అందెశ్రీ మృతికి సంతాపంగా రెండు నిముషాలు అందరూ మౌనం పాటించారు. ప్రభుత్వ లాంఛనాల మేరకు పోలీసులు మూడురౌండ్లు గాలిలోకి గాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డిలు చుట్టూ తిరుగుతూ పాడె మోశారు. సమాధి గుంతలో ఉప్పు వేసి ఖననం అనంతరం పుష్పగుచ్చాలు ఉంచి శ్రద్దాంజలి ఘటించారు. అందెశ్రీ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, గాయకుడు ఏపూరి సోమన్న బృందం అందెశ్రీపై పాటలు పాడారు. జనగాం జిల్లా మద్దూరు మండలం రేపర్తి అందెశ్రీ స్వగ్రామం నుంచి వచ్చిన బంధువులను అంత్యక్రియల స్థలం వద్దకు వెళ్లకుండా చివరిచూపు చూడకుండా పోలీసులు అడ్డుకున్నారని వారు నిరసన తెలిపారు.



షాద్‌నగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్

## ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దు

### గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలి

### పంట ఉత్పత్తుల సేకరణ ప్రక్రియ వేగవంతం

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశం

**షాద్‌నగర్, నవంబరు 11, ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. షాద్ నగర్‌లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి మంగళవారం సందర్శించారు.రైతుల నుండి సేకరించిన నిల్వల నాణ్యతను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత పరిమాణంలో వరి, పత్తి కొనుగోలు చేశారనే వివరాలను అడిగి తెలుసు కున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చుడాలని సూచించారు. రైస్ మిల్లులకు ఎన్ని లోడ్‌ల లారీలు వెళ్ళాయి, ట్రక్ షీట్లు వెంటవెంటనే తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేస్తున్నారా అని ఆరా తీశారు.ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నారు.పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ జరిగిన మీదట కొనుగోలు కేంద్రాలను మూసివేసే ముందు ట్రక్ షీట్‌లు తది తర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఉండకూడదన్నారు.

## పదేళ్ల తర్వాత తడాఖా..

### ఖోఖో స్టేట్ ఛాంపియన్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు

### ద్వితీయ స్థానంలో మహిళా జట్టు

**శామీర్‌పేట, నవంబరు 11, ప్రభాతవార్త :** రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో (ఖోఖో) ఛాంపియన్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు రాణించి కప్‌ను కైవసం చేసుకుంది. అదే విధంగా మహిళల ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి కప్‌లను అందు కుంది. మంగళవారం ఈ విషయాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.మంజుల, తోట జయప్రకాశ్ తెలియజేశారు. ఈ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఖోఖో క్రీడాకారుల కోచ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం ఉపాధ్యక్షులు గుర్రం సత్తిరెడ్డి సంతోషం వ్యక్తంచేశారు.





కప్‌ను అందుకుంటున్న పురుషుల జట్టు

## వికారాబాద్‌లో హై అలర్ట్

### ఢిల్లీ ఉగ్రదాడి ఘటనతో జిల్లాలో పోలీసులు అప్రమత్తం

### రైల్వే, బస్‌స్టేషన్లలో ముమ్మర తనిఖీలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఢిల్లీ ఉగ్రదాడి సంఘటన దేశాన్ని ఒక్కసారిగా కలవరానికి గురి చేసింది. దేశ రాజధానిలో కట్టు దిట్టమైన భద్రతా వ్యవస్థలు ఉన్నా ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడటం పట్ల ప్రజలు ఉలిక్కి పడ్డారు. హైదరాబాద్ మూలాలపై నిఘా సంస్థలు ఆరా తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా పోలీసులూ అప్రమత్తమయ్యారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు బస్, రైల్వేస్టేషన్లలో సోమవారం అర్ధరాత్రి వరకూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. తెల్లవారు జామున కూడా అనేక ప్రాంతాలలో పోలీసులు విధులు నిర్వహించారు. వాహనాల తనిఖీలను మరింత పెంచారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. ఎక్కడా ఘర్షణలకు ఆస్కారం ఇవ్వకుండా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అసాంఘిక శక్తుల కదలికలపై ఫోకస్ పెట్టారు. దేశంలోని పలు ప్రధాన నగరాలకు వికారాబాద్, తాండూరు మీదుగా రైలుమార్గం ఉన్నది. పలు ముఖ్యమైన రైళ్ల రాకపోకలపై దృష్టి సారించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సాయుధ బలగాలు అప్రమత్తమైనాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేదని ఎస్పీ అన్నారు. అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 1200 మంది పోలీసు సిబ్బంది ఉన్నారని తెలిపారు. అందులో సివిల్, ఆర్మ్డ్ రిజర్వు బలగాలు ఉన్నట్లు చెప్పారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంయమనం పాటించాలని ఎస్పీ నారాయణరెడ్డి వివరించారు. వికారాబాద్ పట్టణంలోని రద్దీగా ఉండే రైల్వే స్టేషన్, బస్టాండ్ మొదలగు పలు ప్రాంతాలలో శాంతిభద్రతల దృష్ట్యా బాంబ్ స్క్వాడ్ అండ్ డాగ్ స్క్వాడ్(తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది. అక్కడున్న ప్రజల తో మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తులు కానీ వస్తువులు కానీ అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో గాని లేదా డయల్ 100కి గాని సమాచారం ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



రైల్వేస్టేషన్‌లో బాంబ్‌స్క్వాడ్ తనిఖీల దృశ్యం

## నిధులిస్తున్నా నీరసమేనా!

**షాద్‌నగర్ మున్సిపాల్టీలో పెద్ద ఎత్తున సిసి రోడ్ల పనులు**

**నాణ్యతా ప్రమాణాలకు తిలోదకం ఇస్తున్న కాంట్రాక్టర్లు**

**అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యం**

**షాద్‌నగర్, నవంబరు 11, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో గతంలో ఎన్నడు లేని విధంగా సీసీ రోడ్లకు ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు ఇస్తుంటే వాటిని సద్వినియోగం చేయటంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పుడు మున్సిపాలిటీకి చెందిన ఏఈ, కానీ వర్క్ ఇన్స్‌పెక్టర్లు పరిశీలించడం లేదని ఆరోపిస్తున్నారు. కార్మికులు ఇష్టానుసారంగా రోడ్లు నిర్మాణం చేస్తున్నారని, వర్షపు నీరు వెళ్లేందుకు వీలులేకుండా కొన్ని కాలనీలలో పనులు జరుగుతున్నాయని మండిపడుతున్నారు. పట్టణంలో నిర్మిస్తున్న రహదారుల క్యూరింగ్ సరిగ్గా చేయడంలేదని పలు కాలనీలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. తిరుమల మెఘా టౌన్ షిప్ కాలనీలో గత అయిదు రోజుల క్రితం సీసీ రోడ్డు వేశారు. కానీ, దానికి మళ్ళీ తిరిగి చూసే నాథుడే కరువు అయ్యారు. సీసీ రోడ్డుపై కట్టలు కట్టి క్యూరింగ్ చేపట్టాలి అలా చేపడితేనే రోడ్డు నాణ్యతగా ఉంటుంది.ఇంత వరకు రోడ్డు వేసి రోజులు గడుస్తున్న కూడా క్యూరింగ్ జరగక పోవడంతో.. రోడ్డు వేశామా అంటే వేశాం అన్నట్లుగా రోడ్డు వేసి నిరక్ష్యంగా వదిలేశారు. పట్టణంలో వేసిన సీసీ రోడ్లపై మున్సిపల్ శాఖ అధికారులు పర్యవేక్షించకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కాంట్రాక్టర్ రోడ్డు వేసి క్యూరింగ్ చేయకుండా నిరక్ష్యంగా వదిలేశారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉంటే కాలనీలో కొంత భాగం రోడ్డుపై కట్టలు కట్టారు కానీ నీటిని పట్టలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో పట్టణంలో కొత్తగా వేసిన సీసీ రోడ్లు మూణ్ణాళ్ల ముచ్చటగానే మారనున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై సీడీ,ఎంఎ, ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు దీనంగా వేడుకుంటున్నారు.



రోడ్డు వేసి నీళ్ల పెట్టకుండా వదిలేసిన దృశ్యం



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

## దేశ భవిష్యత్తును మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉంది

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త :** దేశ భవిష్యత్తు ను మార్చ గల శక్తి విద్యకు మాత్రమే ఉందని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల లో జాతీయ విద్య, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య తిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరికి విద్య అందాలి, అందరూ చదువుకోవాలి అనేదే జాతీయ విద్య దినోత్సవ ఉద్దేశమన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

## అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

### ప్రారంభించిన ఎసిపి లక్ష్మీనారాయణ

**షాద్‌నగర్, నవంబరు 11, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిభా పూలే సోషల్ వెల్ఫేర్ సౌజన్యంతో చటాన్ పల్లి వద్ద ఉన్న బాలుర హాస్టల్‌లో డిస్ట్రిక్ట్ లెవల్ స్పోర్ట్స్ గేమ్స్ అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి.ప్రిన్సిపాల్ ప్రీతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా షాద్ నగర్ ఏసీపీ లక్ష్మి నారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్, మండల విద్యా వనరుల అభివృద్ధి శాఖ అధికారి చంద్రశేఖర్, బీసీ సేన జిల్లా అధ్యక్షులు గడ్డం(సదర్)శ్రీనివాస్ యాదవ్, హాజరయ్యి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ముందుగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కవాతు నిర్వహించారు. అనంతరం ఎంఈవో తో కలిసి ప్రిన్సిపాల్ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీపీ విజయ్‌కుమార్

## విజేతలకు బహుమతులు ప్రదానం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ఫ్లాగ్ డే) కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాల్లో ఆన్‌లైన్ ద్వారా 'డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండాలి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం సీపీ కార్యాలయంలో పోటీల్లో విజేతులుగా నిలిచిన విద్యార్థులకు సిపి ఎస్.ఎం.విజయ్‌కుమార్ అభినందించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(అడ్మిన్) సి.హెచ్.కుశాల్కర్, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు

### యుబిఐ మేనేజర్ అనిల్


మాట్లాడుతున్న మేనేజర్ అనీల్

**నంగునూర్, నవంబరు 11, ప్రభాతవార్త :** 46 ఏళ్లక్రితం ప్రారంభమైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.170 కోట్లకు పైగా వ్యాపారం చేస్తూ ప్రజలకు అనేకరకాల ఆర్థిక సేవలను అందిస్తుందని బ్యాంక్ మేనేజర్ అనిల్ అన్నారు. యూనియన్ బ్యాంక్ 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఖాతాదారులతో కలిసి సంబరాలు నిర్వహించి మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ చేతుల మీదుగా ముంబాయి నగరంలో యూనియన్ బ్యాంక్ ప్రారంభమైందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రూ.21 లక్షల కోట్ల వ్యాపారం చేస్తూ వేల సంఖ్యలో బ్రాంచ్‌లు, ఎటిఎంలు కలిగి ఉన్నాయన్నారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుల సహకారంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవంతంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ లక్కిందర్‌సింగ్, బ్యాంకు ఉద్యోగులు బాల్‌రాజు,మాలతి, శ్రీనివాస్, సిబ్బంది బాలాచారి, సంపత్, భూపతి, ఖాతాదారులు పాల్గొన్నారు.

## దేశిని చిన మల్లయ్యకు ఘన నివాళులు


మాజీఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కోహెడ, నవంబరు 11, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే దేశిని చిన మల్లయ్య ఈ ప్రాంతానికి కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శమని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడిశెట్టి రాజు అన్నారు. మంగళవారం కోహెడలో దేశినిచిన మల్లయ్య 8వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశిని చిన మల్లయ్య తెలంగాణ ఉద్యంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.కార్యక్రమంలో తెలంగాణ జాక్ కన్వీనర్ మంద మల్లేశం, వారికోలు మాజీ సర్పంచ్ కొయ్యడ పర్శరాములుగౌడ్, బిఆర్ఎస్ నాయకులు ఆవుల మహేందర్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మంద సురేష్‌గౌడ్, మానేషం, వేముల శ్రీనివాస్, చింతకింది శంకర్, చంద్రయ్య, జేరిపోతుల మల్లేశం, తాడెం రవీందర్, ఎస్.రమేష్, శంకర్,దేశినిచిన మల్లయ్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబిలో పొదుపు.. అభివృద్ధికి మలుపు

### -బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి

**ములుగు, నవంబరు 11 (ప్రభాతవార్త):** జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేస్తే అత్యధిక వడ్డీని పొందవచ్చునని వంటిమామిడి డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసిసిబిలో నూతనంగా ప్రవేశపెట్టిన స్వర్ణనిధి డిపాజిత్‌ద్వారా 444 రోజులకుగాను అత్యధికంగా 8.25 వడ్డీని పొందవచ్చని అన్నారు. డిపాజిట్లపై డిఐసిజిసి ఇన్సూరెన్స్ సదుపాయంతో పాటు యుపిఐ, మొబైల్ బ్యాంకింగ్, బ్యాంక్ గ్యారంటీ, ఏటిఎం, లాకరు సౌకర్యాన్ని ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు. అతి తక్కువ వడ్డీకి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు బంగారు ఆభరణాలపై అత్యధికంగా గ్రాముకి రూ.7,400 రుణాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

### జెఎసి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ధర్మదీక్ష

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 11, ప్రభాతవార్త :**
42 శాతం బిసి రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బీసీ జేఏసి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా జిల్లా బీసీ జేఏసి చైర్మన్ ప్రభుగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మదీక్ష నిర్వహించారు. దీక్ష కార్యక్రమనికి బీసీ బహుజన సంఘాలు మద్దతు ప్రకటించి దీక్ష లో పాల్గొన్నాయి. ఇట్టి కార్యక్రమం లో పాల్గొన్న టీపీ జే ఏ సి నాయకులు బీసీ జే ఏ సి ముఖ్య సలహాదారుల వై అశోక్ కుమార్ కేంద్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ లను 9 వ షెడ్యూల్ లో చేర్చి చట్ట బద్ధత కల్పించాలని అన్నారు. అనంతయ్య, మల్లయ్య లు మాట్లాడారు. బ కార్యక్రమం లో బీసీ జే ఏ సి వర్కింగ్ చైర్మన్ గోకుల్ కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీధర్ మహేంద్ర కన్వీనర్ లు కుమ్మరి సాయిలు, మల్లికార్జున్ పాటిల్, కోప్పేరా వెంకట హరి హర కిషన్ మీడియా ప్రతినిధి మహేష్ కుమార్ , కో కన్వీనర్ లు మానస, మంగమ్మ, శృతి, వీరమని, శ్యామల నిర్మల, మంజుల, న్యాయవాది డి. నారాయణ,సురేందర్, సుదర్శన్ గౌడ్ సుధాకర్, కొండల్, వివిధ బీసీ కుల సంఘాల నాయకులు వడ్డే లింగయ్య, రాందాస్, అంబదాస్ తాంద్ర రాజు, సుమన్, బిక్షపతి,జైపాల్, దత్తత్రి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు



ధర్మదీక్షలో పాల్గొన్న బీసీ జేఏసీ నాయకులు

# చెరకు రైతుకు మద్దతు ధర అందివ్వాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**సంగారెడ్డి బ్యూరో నవంబర్ 11, ప్రభాతవార్త :**
చెరుకు రైతుకు గిట్టుబాటు అయ్యేలా చక్కర కర్మాగారాల యజమాన్యాలు మద్దతు ధర నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లో చక్కర కర్మాగారాల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు షుగర్ కేన్ ఇన్స్పెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి తదితరులతో కలిసి ప్రస్తుత సీజన్లో చెరుకు క్రషింగ్, మద్దతు ధర నిర్ణయించడంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ,రైతులు, కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు నష్టపోకుండా కంపెనీ నష్టపోకుండా రైతుకు గిట్టుబాటు అయ్యేలా మద్దతు ధర చెల్లించాలని రెండు రోజుల్లో మద్దతు ధరలతో పాటు రవాణాచార్జీల నిర్ణయం కూడా కంపెనీలు ప్రకటించాలని ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులకు సూచించారు. చక్కర ఫ్యాక్టరీల యజమాన్యాలు ఫ్యాక్టరీల యజమాన్యాలు తమ జోన్ పరిధి నాన్ జోన్ పరిధి రైతుల పట్ల వ్యత్యాసం చూపకుండా అధిక ధరను ప్రకటించాలన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) మాధురి మాట్లాడుతూ రైతులకు అందాల్సిన రవాణా ప్రోత్సాహన్ని విత్తన ప్రోత్సాహలను ప్రతి రైతుకు అందించాలని ఫ్యాక్టరీల యజమాన్యాలకు సూచించారు. జహీరాబాద్ మొగుడంపల్లి మండలాలకు చెందిన రైతులకు కూడా అందాల్సిన రైతులను వెంటనే ఇవ్వాలని ఫ్యాక్టరీల యజమాన్యాలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఫ్యాక్టరీల ప్రతినిధులు కృష్ణమోహన్, యుగంధర్, వెంగల్ రెడ్డి రవీందర్ రెడ్డి గోపి చక్కర శాఖకు సంబంధించి శ్రీనివాస్ రెడ్డి,నారాయణ, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

# బిసి ఆక్రోశ సభను జయప్రదం చేద్దాం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, నవంబరు 11, ప్రభాతవార్త :**
42శాతం బిసి రిజర్వేషన్ల సాధన సమితి, బిసి, ఎస్సీ, ఎస్టీ, జెఎసిల ఆధ్వర్యంలో ఈనెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే బిసి అక్రోశ సభను విజయవంతం చేద్దామని బిసి,ఎస్టీ, ఎస్టీ జెఎసి రాష్ట్ర నాయకులు కర్రోళ్ల రవిబాబు, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన బిసి అక్రోశ సభ కరపత్రాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బీసీ వ్యతిరేక పార్టీలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు 9వ షెడ్యూల్ అమలు చేయమని బిజెపి నాయకులు వ్యాఖ్యాలు చేయడంతో బీసీల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్, కేంద్రంలోని బిజెపి సర్కార్ బీసీలను నిర్లక్ష్యం చేస్తూ ఆడుతున్న మాయా ఆటను చూస్తూ బిఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ఓట్ల సమయంలో బీసీలను ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్న కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ పార్టీల దుర్మార్గాలకు చమరగీతం కామారెడ్డి వేదిక కానుందన్నారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తున్నా కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ పార్టీల వైఖరికి నిరసనగా ఈనెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండున్నర కోట్ల మంది బీసీ ప్రజల ఆక్రోశ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గాజుల రవి, బుస్సా రామచంద్రం,గొర్ల ప్రభాకర్, చెరుకు నారాయణ, కంకటి సాయిలు, కొత్త శంకర్, నాగమల్లయ్య, కనకయ్య, మొలంకల చంద్రయ్య, శంకర్, చంద్రం, స్వామి పాల్గొన్నారు.


గాయత్రి హోటల్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం

## గాయత్రి హోటల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

**సిద్దిపేట రూరల్, నవంబరు 11, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్డు వేములవాడ కమాన్ వద్ద గల గాయత్రి హోటల్‌లో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారంమేరకు పోలీసు అధికారులతో కలిసి మున్సిపల్ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఎసిసి రవీందర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌లు హోటల్‌పై దాడి చేసి సీజ్‌చేశారు. పట్టణంలో ఎలాంటి వ్యాపారాలు అయినే సరే అనుమతులకు, నియమ నిబంధనలకు లోబడి జరుపాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ సూచించారు. అనుమతులకు విరుద్ధంగా అసాంఘీక కార్యక్రమాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గాయత్రి హోటల్ సీజ్ చేయడంతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దుచేసినట్లు వివరించారు. అలాగే పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల యజమాన్యం చెత్తను పాఠశాల నిర్మాణ పనుల వ్యర్థాలను ముగురునీటి పక్కన గల ఖాళీ స్థలంలో వేయడంతో రూ.2500 జరిమానా విధించిరనట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిఫ్, భారత్వాజ్, అజ్మత్ అలీ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

### తోగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి

**మెదక్, నవంబరు 11, ప్రభాతవార్త:** ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని తోగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల పరిధి మిర్జాపల్లిలోని హనుమాన్ దేవాలయ 14వ వార్షికోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు సందర్శించడానికి కొంత సమయం కేటాయించాలన్నారు. దేవాలయాలతో ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పోతరాజు రమణ, భక్తులు పాల్గొన్నారు.


మిర్జాపల్లిలోని హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి మాధవానంద సరస్వతి


పాత నేరస్తులు,అనుమానితులతో మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

## విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి

### తూప్రాన్ డిఎస్‌పి నరేందర్‌గౌడ్

**మెదక్, నవంబరు 11,ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ, స్టేషన్‌లోని కేసుల వివరాలు, నేరాలు జరిగే ప్రాంతాలు, శాంత్రి భద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి ఎస్ఐ నారాయణగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌ను వచ్చిన వారితో మర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు. సిసి కెమెరాల ప్రాధాన్యత గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాత నేరస్థులు, అనుమానితులతో మాట్లాడి సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ ఉన్నారు.

## దేవాలయాల్లో మానసిక ప్రశాంతత

### మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**మెదక్, నవంబర్ 11,ప్రభాతవార్త:**
దేవాలయాలతో ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల పరిధి మిర్జాపల్లిలోని హనుమాన్ దేవాలయ 14వ వార్షికోత్సవ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధాత్మిక చింతనతో ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మిర్జాపల్లి నుండి మదూర్‌కు వెళ్లే రహదారికి మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆయన దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పోతరాజు రమణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, సాన సత్యనారాయణ,మనోజ్,జనార్ధన్‌రెడ్డి, మోహన్ నాయక్, రాజ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

### మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య


మాట్లాడుతున్న మాజీ ఎంపిపి శ్రీకాంత్‌రెడ్డి

**నంగునూర్, నవంబరు 11, ప్రభాతవార్త :**
రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని...కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకున్న రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయక పోవడం సరికాదని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నంగునూర్ మండల వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యానికి డబ్బులు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో రైతులకు సకాలంలో ఎరువులు, పంట పెట్టుబడి, పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకున్న రైతుల ఖాతాలలో సకాలంలో డబ్బులు జమచేయడం జరిగిందని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎంత సంతోషంగా ఉన్నారో కాంగ్రెస్ సర్కార్‌లో అంత బాధపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ధాన్యం అమ్ముకున్న రైతుల ఖాతాలలో వెంట వెంటనే డబ్బులు జమ చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కోల వీరయ్యగౌడ్, వేణుచక్రవర్తి, రంగు రాజుగౌడ్, చలికాని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి

**సిద్దిపేట రూరల్, నవంబరు 11, ప్రభాతవార్త :** భారత తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను టిపిసిసి మైనార్టీ రాష్ట్ర నాయకులు వహీద్‌ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబుల్ కలాం పలు గ్రంథాలను రాసి ప్రచురించి మహకవిగా, పండితునిగా,ధార్మికవేత్తగా ఎనలేని ఖ్యాతిని ఆర్జించారని అన్నారు. 1947లో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి విలక్షనమైన విద్యా ప్రణాళికలను అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర నాయకులు గంప మహేందర్ రావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), షబాజ్‌ఖాన్, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు, నవంబరు 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన పిడిశెట్టి పర్శరాములు పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా గుండెపోటుతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న యువనాయకుడు వంగ రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం పంపించారు. దీంతో పన్యాల వెంకట్‌రెడ్డి, ఎర్రోళ్ల తిరుపతి, సుగేందర్‌రెడ్డి, గడ్డం వెంకటేశం, రాజు, రమేష్, రాజిరెడ్డి, కిషన్, పోచయ్య,చంద్రయ్య తదితరులు బాధిత కుటుంబీకులను మంగళవారం పరామర్శించి రాజేశ్వర్‌రెడ్డి పంపించిన రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## పులిహోర పంపిణీ


పులిహోర పంపిణీ చేస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, నవంబరు 11 (ప్రభాతవార్త):** పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం ఆర్యవైశ్య యువ నాయకుడు కాపర్తి సంతోష్ ప్రసన్న దంపతుల సౌజన్యంతో పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మాజీ ఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహోర పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి, సేవా గుణం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కైలాస ప్రశాంత్, గంగిశెట్టి ఉమేష్, కాశినాథ్, సిరిపురం సత్యనారాయణ, కైలాస శ్రీకాంత్, కాపర్తి నవీన్, రాములు, నాగేందర్, కాపర్తి సంతోష్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి ఆక్రోశ సభను జయప్రదం చేయాలి

### -బిసి, ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు


ఆక్రోశ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేఏసి నాయకులు

**గజ్వేల్, నవంబరు 11 (ప్రభాతవార్త):** 42 శాతం బిసి రిజర్వేషన్ల సాధన సమితి, బిసి,ఎస్సీ,ఎస్టీ జేఏసి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే బిసి ఆక్రోశ సభను జయప్రదం చేయాలని జేఏసి రాష్ట్ర నాయకులు టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు రామచంద్రం, కర్రోల్ల రవిబాబు, సర్గం రాజేశం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల కుమార్, మైస రాములు, మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిసి ఆక్రోష సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బిసి ఎస్సీ ఎస్టీ జేఏసి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్, బిసి ఫ్రంట్ నాయకులు బాలరాజుగౌడ్‌ల నాయకత్వంలో నడుస్తున్న బిసి రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే పోరాటానికి అందరూ కలిసిరావాలన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి భారత రాజ్యాంగంలో తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చే ప్రక్రియలో నిజాయితీ లేకుండా తప్పుడు జివోల ద్వారా బిసి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా, బిసి రిజర్వేషన్ల బిల్లును భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో పెట్టమని నిర్లక్ష్యంగా ప్రకటించిన బిజెపి ప్రభుత్వ వైఖరికి నిరసనగా, అలాగే బిసిలను నిర్లక్ష్యం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి నిరసనగా ఈ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక జనాభా కలిగిన బిసిల సమస్య ఈ దేశ ప్రధాన సమస్య అనే నిజం తెలిసి కూడా అగ్ర కుల పాలక వర్గాలు ఆ విషయాన్ని పట్టించుకోకుండా బిసిలను నిరంతరం మభ్యపెడుతూ, మాయమాటలతో రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఆక్రోష సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న బిసి కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు యువజన నాయకులు నీరుడి స్వామి, కేతోజి వినోద్, కానుగుల రమణాకర్, వెంకటేష్, శిలసారం ప్రవీణ్, కన్నాయాదవ్, వేణు, పంబాల ఎల్లయ్య, చేబర్తి యాదగిరి, కొక్కొండ శ్రీనివాస్‌చారి, కాసర్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎంఇవో

**మెదక్, నవంబరు 11, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైనవిద్య అందుతుందని మండల విద్యాధికారి పుష్పవేణి అన్నారు. మంగళవారం గజగట్లపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆమె మట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోదించాలని, నాణ్యమై విద్యను అందించడానికి కృషిచేయాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలు అడిగి వారి నుండి సమాధానాలను రాబట్టారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గాలయ్య, ఉపాధ్యాయులు రమేష్, కవితలు పాల్గొన్నారు.

## ఊర పందుల ఆగం... వరి పంట ధ్వంసం

**చిన్నశంకరంపేట, నవంబరు 11,ప్రభాతవార్త:** మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో ఆరుగాలం కష్టించి పండించిన పంట మరో రెండు రోజుల్లో చేతికి వస్తుందనగా ఊర పందులు రైతన్నను ఆగమాగం చేశాయి. మండల పరిధి అంబాజీపేటకు చెందిన మహిళా రైతు పెంటమ్మకు చెందిన రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, రెండు రోజుల్లో పంటను కోయాల్సి ఉంది. సోమవారం అర్ధరాత్రి ఊర పందులు అర ఎకరాల వరి పంటను ధ్వంసం చేశాయని మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది. గత నెల రోజుల్లో ఉర పందులు పలుమార్లు పంట పొలానికి రాగా పందులను పెంచుతున్న సంగాయపల్లికి చెందిన ఎరుకల యాదగిరి, స్వామి, వెంకట్‌ల దృష్టికి తీసుకెళ్లి పందులను రానివ్వకుండా చూడాలని సూచించారు. కాని వారి నిర్లక్ష్యం మూలంగా పంట పూర్తిగా నష్టపోయిందన్నారు. గ్రామంలో పందులు ఇష్టానుసారంగా తిరుగుతున్న పట్టించుకునే వారు లేరన్నారు. ఈ విషయమై పందులు పెంపకందారులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు మహిళా రైతు పెంటమ్మ తెలిపింది.


ఊర పందుల దాడిలో ధ్వంసం అయిన వరి పంట

## ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం



మౌలానా అబుల్‌కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

**నారాయణఖేడ్, నవంబరు 11, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మైనారిటీ బాలుర ఉన్నత పాఠశాలలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ ముస్లిం యాక్షన్ కమిటీ అధ్యక్షులు మైనోద్దీన్ ఖురేషీ, ప్రధానకార్యదర్శి తాహేర్ అలీ, సభ్యులు హాజరయ్యారు. పాఠశాల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగా పి. రమేష్ (ఆర్ట్ /క్రాఫ్ట్), జహంగీర్ (సెక్యూరిటీ గార్డు)లను ముస్లిం యాక్షన్ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. సొసైటీ జిల్లా స్థాయి స్పార్క్ ఫెస్ట్‌లో ఉత్తమప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాములు పాఠశాల/కళాశాల కో-ఆర్డినేటర్ జాకీర్, సంజీవ్‌నాయక్, ఉపాధ్యాయులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి నారాయణఖేడ్ ముస్లిం యాక్షన్ కమిటీ అధ్యక్షులు మైనోద్దీన్ ఖురేషీ, యునుస్, అజీమ్ కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారితల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమైక్య కార్యాలయంలో శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

**చిలిపిచెడ్, నవంబరు 11, ప్రభాతవార్త:**
చిలిపిచెడ్ మండలసమైక్య కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మండలసమైక్యలోని సభ్య గ్రామసంఘాల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు ఒరుగల్లు మహాసమైక్య నుండి వచ్చిన సీనియర్ సిఆర్పిలు ఎండి.షాహీన్, యు.సరితలచే శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గ్రామసంఘాల లీడర్లకి విధులు, బాధ్యతలు, అధికారాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. పుస్తక నిర్వహణపై గ్రామసంఘాల, మండలసమైక్యల సమగ్ర నిర్వహణపై పరిపూర్ణ అవగాహన ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎపిఎం గౌరీశంకర్, సిసిలు శ్రీకాంత్, లక్ష్మణ్, పురుషోత్తం, అకౌంటెంట్ మానస, మండలసమైక్య అధ్యక్షురాలు మమత, కార్యదర్శి మాధురి, కోశాధికారి అంజలితోపాటు సభ్య గ్రామ సంఘాల పదాధికారులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులను మంత్రముగ్ధులనుచేసిన విద్యా షా రంగ్ సుఫియానా

**పటాన్‌చెరు, నవంబరు 11, ప్రభాతవార్త:**
ప్రఖ్యాత భారతీయ గాయని, స్వరకర్త, రచయిత్రి విద్యా షా సూఫీ సంగీతం రంగ్ సుఫియానా మంగళవారం హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కెఎస్ పిపి)లో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సంస్కృతి పేరిట కెఎస్ పిపి నిర్వహిస్తున్న తొలి సాంస్కృతిక కార్యక్రమం ఇది. దక్షిణభారత కుటుంబంలో జన్మించి, కర్ణాటక సంగీతంలో శిక్షణపొందిన విద్యా షా విభిన్న సంగీత సంప్రదాయాలను సమాన అభిరుచితో సాధన చేశారు. ఆమె తన హృదయపూర్వక ప్రదర్శనలు, సంభాషణల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సారంగిపై కమల్ అహ్మద్, తబలాపై సర్దార్‌ఖాన్, కీబోర్డుపై ఉమర్‌ఖాన్, ప్యాడ్‌లో మానస్‌దాస్‌గుప్తా తదితరులు విద్యా షాకు సహకారం అందించారు.

## నల్లా పైపు లీకేజీని సరిచేయండి

-వృథాగా వెళుతున్న నీరు



నల్లా పైపు లీకేజీ అయి నీరంతా వృథాగా వెళుతున్న దృశ్యం

**నర్సాపూర్, నవంబరు 11, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని శివాలయం 5వవార్డులోగల శివాలయం పూజారి వీరప్పగురూజీ ఇంటి వెనకగల నల్లా పైపు లీకేజీ అయి నీరంతా వృథాగా పోతున్నాయి. దీంతో వార్డు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు మున్సిపల్ అధికారులు సిబ్బంది స్పందించి వెంటనే శివాలయం 5వార్డులో లీకేజీ అవుతున్న నల్లా పైపు లైన్ లీకేజీని సరిచేసి వృథాగాపోతున్న నీటిని అరికట్టాలని కోరుతున్నారు.

## తొగరుపల్లిలో సంచార జ్ఞాన ప్రయోగశాల కార్యక్రమం



తొగర్‌పల్లిలో జ్ఞాన ప్రయోగశాల నిర్వహిస్తున్న దృశ్యం

**కొండాపూర్, నవంబరు 11, ప్రభాతవార్త:**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొగరుపల్లిలో సంచార జ్ఞాన ప్రయోగశాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా ఆరవతరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, గణితశాస్త్రం, సాంఘికశాస్త్రం మొదలగు అంశాలను ప్రయోగాలద్వారా విద్యార్థులకు ఉదయం నుండి సాయంత్రం వరకు వివరించడం జరిగింది. విట్టల్‌నాయక్, కిష్టయ్య, నరేందర్, ఎన్.శ్రీనివాస్, టి.వెంకటేష్, విజయకుమార్, జ్యోతి, వేణుగోపాల్, డి.శ్రీనివాస్, ప్రశాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి దశరథ్ పాల్గొని సంచార విజ్ఞాన ప్రయోగశాల ఎంతో ఉపయోగకరంగా ఉన్నదని ప్రశంసించారు.

## ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ

**చిక్కడపల్లి, నవంబరు 11, ప్రభాతవార్త:**
మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ అంబల్ల జనార్దన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణసభ 13న చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని కుందవరపు హనుమంతరావు కళావేదికలో ప్రముఖ రచయిత కూర చిదంబరం అధ్యక్షతన జరుగుతుందని నిర్వాహకసంస్థ కార్యదర్శి రఘుశ్రీ వివరించారు. ముఖ్యఅతిథిగా కేంద్రీయవిశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు డా.పిల్లలమర్రి రాములు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో గానసభ వి.ఎస్.జనార్దనమూర్తి, డా.రాధశ్రీ తదితరులు పాల్గొంటారన్నారు.

# స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించాలి

**నారాయణఖేడ్, నవంబరు 11, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలోని శాస్త్రినగర్, మన్నల్ల్యూర్, కరస్కుర్తి రోడ్డు, రామ్‌మందిర్ పరిసరాల్లో క్యారీబ్యాగ్స్ చెత్తాచెదారము తొలగిస్తూ రోడ్డును పరిశుభ్రంగా ఉండేటట్లు సిబ్బంది ద్వారా చేపడుతున్నట్లు మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు శానిటేషన్ పనులు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిసిరోడ్లపై చిన్నచిన్న కాగితాలు చెత్తాచెదారం ఉన్న వాటిని సిబ్బంది ద్వారా క్లీనింగ్ చేయిస్తూ ఇరువైపులరోడ్లకు పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి మురికి కాలువలో ఉన్న మురికిని పైకితీసి కాలువలో బ్లీచింగ్ పౌడర్ వేయించి ఇంటి యజమానులకు, రోడ్డుపై రాకపోకలు చేపడుతున్న ప్రజలకు ఎలాంటి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. రోజువారీగా మున్సిపాలిటీ సిబ్బంది ఉదయం నాలుగు గంటలనుండి సాయంత్రంవరకు వారికి కేటాయించిన పరిసరప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేపడుతుంటారని ఆయన తెలిపారు. మురికి కాలువలో ఉన్న మురికిని పైకితీసి మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా వాహనంలో వేసుకొని గ్రామ శివారులోని డంపింగ్ యార్డులో మురికిని వేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణములోని వార్డులోని ఇంటి యజమానులు చెత్తాచెదారమును మున్సిపల్ అధికారులు పంపిణీచేసిన చెత్తబుట్టలో వేసుకొని మున్సిపాలిటీ వాహనాలు వచ్చినప్పుడు అందులోవేసి సహకరించాలని శానిటేషన్ ఇన్స్పెక్టర్ కమిషనర్ ఆదేశాల ప్రకారం పేర్కొన్నారు. పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి సహకరించి పట్టణములోని రోడ్లు, మురికికాలువలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అందరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటివరకు పట్టణ ప్రజలు మాజీ వార్డు కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు యువకులు అందరూ మున్సిపాలిటీ సిబ్బందికి అధికారులకు సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారని అదేవిధంగా మున్సిపాలిటీ సిబ్బందికి అన్ని విషయాల్లోనూ సహకారం అందించి పట్టణంలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకొనేందుకు అందరు కృషి చేయవలసిందిగా శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు.



శుభ్రం చేయిస్తున్న అధికారులు

## కాపర్ వైర్ నిందితుల రిమాండ్

-రూ.3.50 లక్షలు నగదు, మొబైల్ ఫోన్, వాహనం స్వాధీనం



చోరీ చేసిన నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**చౌటకూర్, నవంబరు 11, ప్రభాతవార్త:**
చౌటకూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోగల సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో కాపర్‌వైర్‌ను దొంగిలించిన నిందితులను సోమవారం రిమాండుకుతరలించారు. జోగిపేట సిఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ ఎన్.విశ్వజన్‌లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని యాద్గిర్ జిల్లా గుర్మిట్కల్ తాలుకాలోని సంక్లాపూర్‌కు చెందిన అన్వార్ మొగులప్ప అలియాస్ మోహన్ ప్రస్తుతం మెదక్‌జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో ఉంటున్నారు. ఆయనతోపాటు హైదరాబాద్ నగరంలోని బోలక్‌పూర్ గుల్షన్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ముతలిత్, అదే ప్రాంతంలోని ఇంద్రానగర్‌కు చెందిన మహ్మద్ నూరొద్దీన్‌లు పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తుంటారు. గత నెల అక్టోబరు 30వ తేదీన సుల్తాన్‌పూర్ జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో విలువైన కాపర్‌వైర్ చోరీకి గురైంది. ఈసంఘటన విషయమై హైదరాబాద్ జెఎన్టీయు కూకట్‌పల్లికి చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ మహ్మద్ తర్బేజ్ 31వ తేదీన పుల్కల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు విషయమై దర్యాప్తు చేస్తున్నారు. తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద అమర్చిన సిసి కెమెరా ఫుటేజిని పరిశీలించగా, టాటా సూపర్ ఎస్ ఎపి29టిసి 0903 వాహనం రాత్రివేళలో వచ్చి వెళ్లినట్లు గుర్తించారు. ఆవాహనంపైగల ఫోన్ నంబర్ ఆధారంగా కాల్ వివరాలను సేకరించారు. మనోహరాబాద్‌లో అన్వార్ మొగులప్ప అలియాస్ మోహన్ దుకాణం వద్ద ఉన్నట్లుగా గుర్తించారు. మొగులప్పను అదుపులోకి తీసుకుని విచారించగా, వాహనంలో వచ్చి సోలార్ విద్యుత్ ప్లాంట్‌లోకి చొరబడి మధ్యప్రదేశ్‌కు చెందిన గోపాల్‌తో కలిసి కాపర్ కేబుల్‌ను దొంగిలించినట్లు అంగీకరించారు. కాపర్‌వైరును అధికధరకు విక్రయించామని ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి నగదు రూ.3.50 లక్షలు, రెండు కట్టర్లు, మూడు హాక్సా బ్లేడ్లు, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తూ, కాపర్, అల్యూమినియం వైర్‌ను దొంగిలించి వేరుచేసి స్క్రాప్‌గా విక్రయించి సొమ్ము చేసుకుంటుంటారని సిఐ అనిల్‌కుమార్ వివరించారు. మహ్మద్ నూరొద్దీన్‌పై శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనంకేసు నమోదై ఉన్నది. ఈమేరకు నిందితులను జ్యూడిషియల్ రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**చౌటకూర్, నవంబరు 11, ప్రభాతవార్త:**
చౌటకూర్ మండలంలోని పలువురు లబ్దిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు. మండలకేంద్రమైన చౌటకూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, జోగిపేట డివిజన్ ఆత్మకమిటీ చైర్మన్ మల్లారెడ్డితో కలిసి చెక్కులను పంపిణీచేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 31 మంది లబ్దిదారులకు రూ. 12,37,500 లక్షల చెక్కులను అందజేశారు. వివిధ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సపొంది కోలుకున్న బాధితులు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు మంజూరైన చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో మండలకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు రాములు, ఈశ్వర్‌గౌడ్, గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలగొండ, రాజశేఖర్, బుర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, వర్కల రమేష్, కిరణ్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, రాంరెడ్డి, మొగులయ్య, శివకుమార్, భాస్కర్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## సృజనాత్మక ఆలోచనలతో సామాజిక సమస్యల పరిష్కారం

**చిక్కడపల్లి, నవంబరు 11, ప్రభాతవార్త:**
సృజనాత్మక ఆలోచనలతో సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రురల్ ఎడ్యుకేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ శైలా తల్లూరి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి బి.ఆర్.అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రురల్ ఎడ్యుకేషన్) సంస్థ మధ్య ఒక అవగాహన ఒప్పంద కార్యక్రమం జరిగింది. ఈసందర్భంలో ప్యూర్ యువత క్లబ్ పరిచయ కార్యక్రమం నిర్వహించబడింది. ఈకార్యక్రమంలో డా. శైలా తల్లూరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉగాండా, నైజీరియా, కెన్యా వంటి దేశాలతోపాటు యాభైకిపైగా చాప్టర్లు ఉన్న గ్లోబల్ నెట్‌వర్క్ గురించి వివరించారు. తమ క్లబ్‌లో చేరి తమ సృజనాత్మక ఆలోచనలతో సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు డిజైన్ థింకింగ్ పద్ధతిని ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్ అవకాశాలు కూడా కల్పించారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతోపాటు సామాజికసేవలో భాగస్వాములు కావడానికి ఇది ఒక అద్భుతవేదికగా నిలుస్తుందన్నారు.

## బ్రాహ్మణ స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

**చార్మినార్, నవంబరు 11, ప్రభాతవార్త:**
సామాజిక సేవాకార్యక్రమాలను విరివిరిగా నిర్వహించేందుకు బ్రాహ్మణులు, బ్రాహ్మణ స్వచ్ఛందసంస్థలు మరింత ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రొఫెసర్ ఆచార్య కాకునూరి సూర్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. పాతబస్తీ ఉప్పుగూడలోని కన్యాకుబ్జ్‌భవన్‌లో దక్షిణభారత కన్యాకుబ్జ్ బ్రాహ్మణసభ ఆధ్వర్యంలోజరిగిన దీపావళి సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దాదాపు 45సంవత్సరాలు సామాజిక సేవాకార్యక్రమాలలో చురుకుగాపాల్గొన్న 15మంది బ్రాహ్మణులను ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేసి వారిసేవలను ఆయన కొనియాడారు. ఈసందర్భంగా ఆచార్య కాకునూరి సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో ఇప్పటికే బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన అధికారులు, అనధికారులు ఎంతో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన పేదవిద్యార్థులు విద్య, వైద్య, ఆర్థికరంగాలలో నిలదొక్కుకునేందుకు అన్నివిధాల సహాయాన్ని అందిచాలని ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో దక్షిణభారత కన్యాకుబ్జ్ బ్రాహ్మణసభ అధ్యక్షులు రామ్‌కుమార్‌తివారి, ఉపాధ్యక్షులు రాకేష్‌తివారీ, ప్రధానకార్యదర్శి విజయ్‌పాల్‌పాండే, సంయుక్తకార్యదర్శి రాజేంద్రప్రసాద్, కోశాధికారిగోపాల్ శుక్లా పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు జరిగాయి.

## పద్యనాటకోత్సవాలకు ఆదరణ తగ్గలేదు

**చిక్కడపల్లి, నవంబరు 11, ప్రభాతవార్త:**
చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని సంగీత కళావేదికలో సర్వేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం పద్యనాటకోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ చైర్మన్ టి.రాంబాబు, అనిల్‌చక్రవర్తి నిర్వహణలో జరిగింది. ఈ సందర్భంగా ఆరాధనసంస్థ అధినేత లోకం కృష్ణయ్యను ఘనంగా సత్కరించి అభినందించారు. దీనిలోభాగంగా శ్రీకృష్ణరాయబారం, దుర్యోధన మయసభ, శ్రీరామాంజనేయయుద్ధం, శ్రీకృష్ణ ఏకపాత్రాభినయం అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమంలో యక్షగాన కంఠీరవ పసుమర్తి శేషుబాబు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, విశ్రాంత విద్యుత్‌శాఖ ఉన్నతాధికారి యు.విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

## అందెశ్రీ మృతి తెలుగు సాహిత్యానికి తీరనిలోటు

**చిక్కడపల్లి, నవంబరు 11, ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమకాలంలో అందెశ్రీ రచనలు ప్రజల్లో ఉద్యమజ్యోతి వెలిగించాయని సర్వజన వికాస్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ వివరించారు. తెలంగాణప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ ఆయనరాసిన జయజయహే తెలంగాణ, జననీ జయకేతనం పాటను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రగీతంగా స్వీకరించిందని, ఇది ఆయనకు అమరత్వాన్ని ఇచ్చిన గొప్ప ఘట్టం అని అన్నారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతికరంగాలకు అపూర్వమైన సేవలందించిన అందెశ్రీమరణం తీవ్రవిషాదాన్ని మిగిల్చిందన్నారు. కాకతీయవిశ్వవిద్యాలయంనుండి గౌరవ డాక్టరేట్ పొందిన అందెశ్రీ సాహిత్యం, సాంఘికకృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.

# నాణ్యమైన విత్తనంతో దేశ సమగ్ర అభివృద్ధి సాధించగలం

-ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రాహుల్‌విశ్వకర్మ



తునికి గ్రామ రైతులకు నాణ్యమైన విత్తనంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కె.రాహుల్‌విశ్వకర్మ

**కౌడిపల్లి, నవంబరు 11, ప్రభాతవార్త:**
రైతులు నాణ్యమైన విత్తనంతో పంటలు సమృద్ధిగా పండించి తద్వారా దేశ సమగ్ర అభివృద్ధి సాధించగలమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త కె.రాహుల్ విశ్వకర్మ ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం మండల పరిధిలోని తునికిగ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తంలో భాగంగా వరి పంటపై క్షేత్రదినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి, శాస్త్రవేత్త తునికి గ్రామరైతులు పండించిన ఎంటియూ-1010 రకం వరిని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో శాస్త్రవేత్త రాహుల్‌విశ్వకర్మ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనంతో పంటలు పండించి తద్వారా దేశ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని మహోత్తర లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ప్రతి మండలంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి విత్తనకిట్లు అందచేయడం జరిగిందని అన్నారు. ఈ నాణ్యమైన విత్తనాలను రైతులు తమ పొలాల్లో పండించి తద్వారా పండిన విత్తనాల్ని ఇతర రైతులకు చేరవేసేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ఇది విత్తన లభ్యతను పెంచడమే కాకుండా నాణ్యమైన విత్తనంపై అవగాహన కల్పించుటకు దోహదపడుతుందని అని అన్నారు. అలాగే రైతులకు అవసరమైన సూచనలు, సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుంది అని వరిపంటల రైతులకు ఆయన వివరించారు. అనంతరం కౌడిపల్లి వ్యవసాయ ఎడిఎ పుణ్యవతి మాట్లాడుతూ ఎంటియూ-1010 వరి విత్తనాన్ని ఒక రైతు నుండి మరొక రైతుకు ఇవ్వడం ద్వారా మంచి లాభాలు, నాణ్యమైన విత్తనాన్ని పొందవచ్చు అని ఆమె తెలిపారు. మండల మానిటరింగ్ అధికారి డా.అరుణశ్రీ మాట్లాడుతూ ఈవిత్తనాన్ని సురక్షితమైన ప్రదేశంలో నిల్వ చేసుకొని, వచ్చే సీజన్‌కి వాడవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో వీరితోపాటు మండల వ్యవసాయాధికారి స్వప్నజాదేవ్, ఎంఈవో ఎం.నరేందర్, తెలంగాణ రైతువిజ్ఞానకేంద్రం ప్రొఫెసర్-1 ఎస్.శ్రీకాంత్, గ్రామరైతులు కొర్రె శ్రీను, వి.రాములు, పద్మకిష్టయ్య, అల్మాయిపేట శ్రీనివాస్, దొంతుల రాములు, రమావాత్ పకీర, పోచాగౌడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తులో ఆటోడ్రైవర్‌పై దాడి

-హద్దుమీరుతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు

**కొంపల్లి, నవంబరు 11, ప్రభాతవార్త:**
ఆటోవెళ్లడానికి దారి ఇవ్వండి అంటూ అడిగిన ఆటోడ్రైవర్‌ను గంజాయి బ్యాచ్ చితకబాది తీవ్రంగాగాయపరిచింది. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంపేట రాజీవ్‌గృహకల్ప వద్ద ఈ సంఘటన సోమవారం రాత్రి సుమారు పదిన్నరగంటలకు చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాజీవ్‌గృహకల్పలోని 74 బ్లాకులో నివసిస్తూ ఆటో నడుపుకొని జీవనం గడిపే అరుణ్‌నాయక్ సోమవారంరాత్రి తన డ్యూటీ ముగించుకొని ఆటో నడుపుకుంటూ రాజీవ్‌గృహకల్పలోని తనబ్లాక్‌కు వెళ్లడానికి ప్రయత్నించాడు. రాజీవ్ గృహకల్పలో ఇటీవల ఒకవైపు నూతన సిసిరోడ్డు వేసి ఉండగా మరోవైపు మాత్రమే రాకపోకలకు అనువుగా ఉంది. దీంతో తన ఆటోను ముందుకు వెళ్లడానికి దారి ఇవ్వండి అంటూ అదేకాలనీ 80 బ్లాకులో నివసించే తిలక్‌నాయక్‌ను అరుణ్‌నాయక్ అడిగాడు. దీంతో తిలక్‌నాయక్‌తోపాటు సుమారు మరో 15మంది విపరీతంగా మద్యం, గంజాయి సేవించి ఉండడంతో, ఆమత్తులో అరుణ్‌నాయక్‌పై తిరగబడి విపరీతంగా గాయపరిచారు. మత్తులో తిలక్‌నాయక్ బ్యాచ్ ఏమి చేస్తున్నారో వాళ్లకే అర్థంకానిస్థితిలో అరుణ్‌నాయక్‌ను తీవ్రంగా గాయపరిచారు. ఈవిషయమై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. అయితే బాచుపల్లి పోలీసులు ఈవిషయం దర్యాప్తులో ఉందని వివరాలు తర్వాత వెల్లడిస్తామంటూ స్పష్టంచేశారు. జరిగిన సంఘటన స్థానికంగా వాట్సాప్ గ్రూపులో విస్తృతంగా వైరల్‌కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. రాజీవ్‌గృహకల్పలో జరుగుతున్న పరిణామాలపై బాచుపల్లి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే..!

## మూడున్నర కిలోల గంజాయి పట్టివేత

-అవగాహన లేక పోలీసులు విద్యుత్ సిబ్బంది తోపులాటలు

**ఎల్.బి.నగర్, నవంబరు 11, ప్రభాతవార్త:**
అక్రమంగా తరలిస్తున్న మూడున్నరకిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈసంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 9వతేదీ రాత్రి విశ్వసనీయసమాచారంతో నాగోల్‌లోని నిమంత్రన్ ప్యాలెస్ సమీపంలో అక్రమంగా గంజాయిని రవాణాచేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా గొల్లపల్లికి చెందిన శ్యామల అరవింద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనివద్ద నుంచి 3.542కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా తనకాలనీకి చెందిన వేణు తన నలుగురు స్నేహితులతో కలిసి తనని కిడ్నాప్‌చేసి హయాత్‌నగర్‌లో తన స్నేహితుని ఇంట్లో అక్రమంగా నిర్బంధించినారని తెలుపటంతో చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో అరవింద్‌పై గంజాయికేసు, వేణు, అతని నలుగురు స్నేహితులపై కిడ్నాప్‌కేసు నమోదుచేశారు. కేసు నమోదు అనంతరం పోలీసుల అదుపులో ఉన్న అరవింద్ 10వతేదీ రాత్రి 10గంటల సమయంలో పోలీసువారితో మరికొంత గంజాయి తన స్నేహితుడు చంటి వద్ద ఉన్నదని, తనను తీసుకెళ్తే అతనిని చూపించి, గంజాయితో సహా పట్టిస్తానని సమాచారం ఇచ్చారు. అరవింద సమాచారం మేరకు అక్కడికి వెళ్ళిన పోలీసులకు చంటి గంజాయితో పట్టుబడ్డాడు. ఈవిషయమై పంచనామారాయటానికి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు అవసరం ఉండటంతో రాత్రి సుమారు 10గంటల సమయంలో అందుబాటులో ఉన్న కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ దగ్గరలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు లిఖితపూర్వక లెటర్ పంపగా, అక్కడ సబ్‌స్టేషన్‌లో ఉన్న ఇద్దరు సిబ్బందికి పోలీసులు పంపిన లెటర్‌పై అవగాహన లేకపోవటంతో పోలీసువారితో వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఒకరినొకరు తోసుకోవటం జరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించి విచారణచేపడుతున్నామని అన్నారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంలో 14నుంచి బాలల వారోత్సవాలు

**చార్మినార్, నవంబరు 11, ప్రభాతవార్త:**
సాలార్‌జంగ్ మ్యూజియంలో నవంబరు 14నుంచి 20వ తేదీవరకు బాలల వారోత్సవాలను నిర్వహించనున్నామని మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ ఆర్.బి.నాయక్ తెలిపారు. బాలల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులను జూనియర్, సీనియర్‌లుగా విభజించి వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు. నవంబరు 17వ తేదీ సోమవారం ఉదయం 11నుంచి 1గంటవరకు వ్యాసరచన (తెలుగు,హిందీ,ఇంగ్లీషు,ఉర్దూ భాషలలో) పోటీ, 18వ తేదీన మంగళవారం ఉదయం 11నుంచి 1గంటవరకు వక్తృత్వం (తెలుగు,హిందీ,ఇంగ్లీషు,ఉర్దూ భాషలలో) పోటీ, 19వ తేదీ బుధవారం 11నుంచి 1గంటవరకు డ్రాయింగ్(తెలుగు,హిందీ,ఇంగ్లీషు,ఉర్దూ భాషలలో) పోటీజరుగుతుందని ఆయన తెలిపారు. 6,7,8తరగతి విద్యార్థులు జూనియర్లుగా, 9,10వతరగతి విద్యార్థులను సీనియర్లుగా విభజించామని ఆయన తెలియజేశారు. పోటీలలో పాల్గొనదలచే విద్యార్థులు 8095414812 ఫోన్‌నెంబర్‌ను సంప్రతించాలని సాలార్‌జంగ్ మ్యూజియం క్యూరేటర్ ఆర్.బి.నాయక్ తెలిపారు.

## డా.శ్రీరంగాచార్యకి తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కారం

**నాంపల్లి, నవంబరు 11, ప్రభాతవార్త:**
సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతిసంవత్సరమిచ్చే విశిష్టపురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ సాహితీవేత్త, ఉత్తమ అధ్యాపకుడు, వక్త, గ్రంథపరిష్కర్తలు డా.శ్రీరంగాచార్యకు ప్రదానం చేయబోతున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 1943లో నల్గొండజిల్లా చందుపట్ల గ్రామంలో జన్మించిన శ్రీరంగాచార్య 1966 నుండి 2022వరకు మూడున్నర దశాబ్దాలు నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం ఓరియంటల్‌కళాశాలలో అధ్యాపకుడు, ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగాపాల్గొన్న రంగాచార్య ఆరుతరాల మరింగంటి కవుల కృతులను వెలుగులోకి తెచ్చి వారికి ప్రాణప్రతిష్ఠ చేశారు. నల్గొండజిల్లా కవులు, పండితులెందరినో లోకానికి పరిచయం చేశారు. ఒకతరం పండితులకు అంతేవాసిగా మెలిగి ఆ పాండితీ సుగంధాన్ని తర్వాతితరానికి అందజేయడంలో కృతకృత్యులైన డా. శ్రీరంగాచార్యులకు విశ్వవిద్యాలయ ప్రతిష్ఠాత్మక విశిష్ట పురస్కారానికి ఎంపికచేసినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం డిసెంబరు 2న జరిగే ప్రత్యేకకార్యక్రమంలో శ్రీరంగాచార్యకు పురస్కారం, పురస్కారంతోపాటు లక్షరూపాయల నగదు, ప్రశంసాపత్రం అతిథుల చేతులమీదుగా అందజేయడం జరుగుతుందని కోట్ల హనుమంతరావు వెల్లడించారు.

## వైభవంగా హరేకృష్ణ స్వర్ణదేవాలయంలో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**రవీంద్రభారతి, నవంబరు 11, ప్రభాతవార్త:**
హరేకృష్ణ స్వర్ణదేవాలయం హైదరాబాద్‌లో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 14 నుండి 19వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాసప్రభుజీ తెలిపారు. ఈమేరకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పోస్టర్, కార్యక్రమ వివరాలను చంద్రదాసప్రభుజీ ఈరోజు విడుదలచేసి వివరాలు వెల్లడించారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 14న శ్రీ లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తుల, ఉత్సవమూర్తుల అభిషేకంతో ప్రారంభమౌతుంది.17,19తేదీల్లో శ్రీభూసమేతనరసింహస్వామి కళ్యాణోత్సవం, శ్రీరాధాగోవిందదేవుల 108కలశ మహాచూర్ణాభిషేకం, మహాసంప్రోక్షణ వంటి ప్రధాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14శుక్రవారం ఉదయం 5.15లకు శ్రీలక్ష్మీనరసింహస్వామి అభిషేకం, రాత్రి 6.30లకు భూవరాహపూజ, వైనతేయ ప్రతిష్ఠ, అకురార్పణ; 15 శనివారం ఉదయం 8.30లకు ధ్వజారోహణం, 10లకు ఉత్సవహోమం, సాయంత్రం 5గంటలకు దేవత ఆవాహన, 6లకు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఊంజలసేవ; 16 ఆదివారం ఉదయం 9.30లకు మహాసుదర్శనహోమం, రాత్రి 6లకు ఉత్సవహోమం, హనుమత్‌వాహనసేవ, శ్రీరాధాగోవింద ఝూలన్ ఉత్సవం; 17సోమవారం ఉదయం 9.30లకు శ్రీరాధాగోవింద విగ్రహప్రతిష్ఠ, ఉత్సవహోమం, 11.30లకు చప్పన్ భోగ్‌సేవా, రాత్రి 6లకు ఉత్సవహోమం, 7లకు శ్రీభూసమేతనరసింహస్వామి కళ్యాణోత్సవం, భక్తుల సౌకర్యార్థం ప్రసాదపంపిణీ, వసతి, రవాణా వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయబడ్డాయని, అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాకార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.